వైఎస్సార్ బీమా.. కొండంత ధీమా



వైఎస్సార్ బీమా పరిహారం అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు(ఫైల్)

- వైఎస్సార్ బీమా పరిహారంతో పలువురికి ఉపశమనం
- జోన్–3 పరిధిలో 41,383 మందికి లబ్ధి

ఎంవీపీ కాలనీ: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఇలా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో వైఎస్సార్ బీమా ఒకటి. దీని ద్వారా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తోంది. గతంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ బీమాను అమలు చేసినా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా రూ.330 బీమా ప్రీమియం చెల్లిస్తూ ఈ పథకాన్ని అమలు చేస్తోంది. క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కల్పిస్తోంది.

జోన్–3 పరిధిలో 41,383 మందికి లబ్ధి

18 నుంచి 69 సంవత్సరాలు మధ్య వయసు గల వారు వైఎస్సార్ బీమా పథకానికి అర్హులు. వీరికి రేషన్ కార్డుతో పాటు వ్యక్తిగత బ్యాంకు ఖాతా ఉండాల్సి ఉంటుంది. ప్రతి రేషన్ కార్డుపైన ఆ ఇంటి యజమానిని బీమాకు ఎంపిక చేస్తారు. ఈ బీమా ద్వారా సాధారణ మరణం పొందితే రూ.లక్ష, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు ఆ సంబంధిత కుటుంబానికి అందజేస్తారు. బీమా ప్రీమియం సొమ్ము రూ.330ని లబ్ధిదారుడి తరఫున ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లిస్తోంది. జీవీఎంసీ జోన్–3 పరిధిలో 55,191 మందికి రేషన్ కార్డులు కలిగి ఉన్నారు. వీరిలో 41,383 మంది వైఎస్సార్ అర్హత కలిగి ఉన్నారు. జోన్–3 పరిధిలోని 22వ వార్డులో అత్యధికంగా 4,658 మంది లబ్ధిదారులు ఉండగా, 19వ వార్డులో 4,580, 16వ వార్డులో 4,222 మంది ఆ తరువాతి స్థానాల్లో ఉన్నారు. జోన్–3 పరిధిలో అత్యల్పంగా 20వ వార్డులో 1,720 మంది లబ్ధిదారులు ఉన్నారు.



వైఎస్సార్ బీమా సర్వే వివరాలు నమోదు చేస్తున్న వలంటీర్లు(ఫైల్)

భరోసా ఉంటుంది..

వైఎస్సార్ బీమా ద్వారా పేద కుటుంబాలకు కొండంత భరోసా లభిస్తోంది. ఇంట్లో అనూహ్య పరిణామంలో మరణాలు సంభవిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. కుటుంబ సభ్యులంతా కుంగుబాటుకు గురికాకుండా తోడ్పాటు అందిస్తోంది. అప్పులు, పిల్లల చదువుల విషయంలో భరోసా కల్పిస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి పథకాన్ని అందుబాటులోకి తేవడం చాలా మంచి పరిణామం.

– శ్యామ్ సుందర్, ఎంవీపీ కాలనీ

బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది..

వైఎస్సార్ బీమా నమోదు కోసం వలంటీర్ల ద్వారా సర్వే చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా పలుమార్లు సర్వే కూడా పూర్తయింది. అర్హత ఆధారంగా వలంటీర్లు లబ్ధిదారుల వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వ యాప్ వినియోగించి బయోమెట్రిక్ హాజరు, ఐరిస్ విధానం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపిక అనంతరం లబ్ధిదారుల తరఫున బీమా ప్రీమియం రూ.330ను ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించింది. ఆపదలో ఆ ఇన్సూరెన్స్ సొమ్ము లబ్ధిదారుల కుటుంబాలకు భరోసాగా నిలుస్తుంది.

– వీరబాబు, జోన్–3, డేటా మోనిటరింగ్ విభాగం

విద్యా సమాచారమ్

సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి గేదెల ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యుడు కె.రాజశేఖర్ పర్యవేక్షణలో కాంక్రీటు ఉత్పత్తిలో సిమెంట్‌కి ప్రత్యామ్నాయంగా రెండు రకాల కొల్లాయిడల్ నానో సిలికాను వినియోగించడంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ప్రసన్నకుమార్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు అభినందించారు.

రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం గౌరవ సంచాలకుడు ఆచార్య భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు యోగా విభాగంలో ఉచిత ఆరోగ్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందిస్తామన్నారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ వ్యాధికి సంబంధించిన రిపోర్టులతో నేరుగా హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 94401 91673 నంబరులో సంప్రదించాలని కోరారు.

మార్గదర్శకులు.. పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు నేటి తరానికి మార్గదర్శకులుగా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న లవన్‌కుమార్ వీసీని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏయూ పూర్వ విద్యార్థులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా లవన్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో న్యాయ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో లవన్‌కుమార్ పాల్గొన్నారు. పోటీ పరీక్షలను సన్నద్ధం కావడం, యూపీఎస్సీ పరీక్షలకు సన్నాహం, న్యాయ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అంశంపై ఆయన అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో న్యాయ విద్యార్థులకు లభించే ఉద్యోగ అవకాశాలను వివరించారు.



లవన్‌కుమార్‌ని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

తాను ఇక్కడ విద్యార్థిగా చదువుకుని నేడు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో పని చేస్తున్న విధానం, దీనికి తాను పడ్డ శ్రమ, కష్టాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల చక్కని ప్రణాళికతో పరీక్షలను సిద్ధమవుతూ ఉద్యోగాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకరరావు, వగీర, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మురళీధర్

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో)గా బాధ్యతలు చేపట్టిన పి.మురళీధర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలకు చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్‌కు వివరించారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా కాలేజీలో ప్రిన్సిపాళ్లను అప్రమత్తం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

అడవివరం హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం డీఈవో ఎల్.చంద్రకళ సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు ఎలా వినియోగిస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేలా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. నాడు–నేడు పనుల పురోగతిని పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు వివరించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత పెంచేలా స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సబ్జెక్టు ఉపాధ్యాయులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించామని డీఈవోకు వివరించారు.

6న ఏయూలో నిక్ స్ఫూర్తిదాయక ప్రసంగం



ఏయూ క్యాంపస్: ప్రపంచాన్ని తమ స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ఆకట్టుకుంటున్న ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ ఈ నెల 6న ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో యువతను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేయనున్నారు. చిన్నతనంలో చేతులు, కాళ్లు లేకుండా జన్మించిన నిక్.. తన తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో ఒక్కోమెట్టు ఎక్కారు. తన జన్మకు ఒక లక్ష్యం ఉందని నిర్ణయించుకుని దానిని చేరుకునే ప్రయత్నం చేశారు. ఈ మార్గంలో ఎన్నో అవరోధాలు, అవమానాలు ఎదురైనా నిక్ చలించలేదు. యువతకు స్ఫూర్తిని అందిస్తూ మోటివేషనల్ స్పీకర్‌గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. నిక్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి యువతకు అవకాశం కల్పిస్తామన్నారు.

పదవీ విరమణ వయస్సు పెంపుపై హర్షం

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఏపీ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ గుంటుబోయిన రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులకు ఉపయుక్తంగా మంచి నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అమరావతిలో రాష్ట్ర ఎంప్లాయిస్ గౌరవ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ సంతోషం వ్యక్తం చేశారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ధైర్యం అవసరం

ఆరిలోవ: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ధైర్యం కల్పించాల్సిన అవసరం ఉందని అపోలో వైద్యులు సూచించారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రిలో శుక్రవారం అంకాలజీ వైద్య నిపుణులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకాలజీ వైద్య నిపుణులు రాకేష్ రెడ్డి, ప్రదీప్, సుమన్ దాస్ మాట్లాడుతూ క్యాన్సర్ అంటువ్యాధి కాదన్నారు. ఈ వ్యాధి సోకిన సకాలంలో వైద్యులను సంప్రదించాలన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారి పట్ల వివక్ష చూపకూడదన్నారు. వారిలో ధైర్యం నింపి భయాన్ని పోగట్టడానికి కుటుంబ సభ్యులు ప్రయత్నించాలని సూచించారు. క్యాన్సర్ లక్షణాలు కనిపించిన వ్యక్తులు వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స వెంటనే ప్రారంభించాలన్నారు. అలాంటివారికి తొందరగా వ్యాధి నయమవుతుందని తెలిపారు. పొగ పీల్చడం, ఆల్కహాల్ సేవించడం, స్థూలకాయం ఉన్నవారిలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌ను జయించి ఆరోగ్యంతో ఉన్న 60 ఏళ్ల పైబడిన జయశ్రీ, 17 ఏళ్ల బాలిక తాము సమాజంలో ఎదుర్కొన్న పరిస్థితులను వివరించారు.



మీడియాతో మాట్లాడుతున్న అపోలో అంకాలజీ విభాగం వైద్య నిపుణులు

వైభవంగా పంచాయతన యాగ మహోత్సవం



వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య యాగాలు నిర్వహిస్తున్న సాయికాంత్‌శర్మ దంపతులు

ఎంవీపీ కాలనీ: శ్రీసరస్వతి సహిత పంచాయతన యాగ మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా శ్రీశారదాంబ విద్యానికేతన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఎస్ఎస్‌వీ క్లాసెస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఇందులో భాగంగా సంస్థ వ్యవస్థాపకుడు వి.సాయికాంత్‌శర్మ దంపతులు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తిశ్రద్ధలతో యాగాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, రుద్రాభిషేకం, మండపారాధనతో పాటు లక్ష్మీగణపతి హోమం, చండీ హోమం చేశారు. సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సిమ్యులేషన్ శిక్షణ తరగతుల ప్రారంభం

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ ఉపాధ్యాయుల సిమ్యులేషన్ (అనుకరణ) శిక్షణ తరగతులు శుక్రవారం ఉదయం స్థానిక కేడీపీఎం పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన ఫలితాలను సాధించడం కోసం సాంకేతికతతో కూడిన విజ్ఞానాన్ని బోధించేలా ఉపాధ్యాయుల సామర్థ్యాలు, నిపుణతను పెంచేలా ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక్కో రోజు చెప్పున ఈ తరగతులు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం గణిత ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో రామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమశ్రీ, రిసోర్స్ పర్సన్స్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లాలో మూడు కేంద్రాలలో శుక్రవారం 337 మంది గణిత ఉపాధ్యాయులకు, శనివారం 246 మంది ఫిజిక్స్ ఉపాధ్యాయులకు, సోమవారం 238 మంది బయాలజీ ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణలో ఆగ్ మెంటెడ్ రియాలిటీ(ఏఆర్), వర్చువల్ రియాలిటీ(వీఆర్) వంటి అంశాలతో విద్యార్థుల కళ్ల ముందు ప్రయోగ దృశ్యాలను ఏ విధంగా చూపవచ్చునో వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఉపయోగించి విద్యార్థులకు విజ్ఞానాన్ని మరింత చేరువ చేసే విధానాలపై అవగాహన కల్పించారు.



శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు

క్రమశిక్షణ గల దర్శకుడు విశ్వనాథ్

సీతంపేట: కళాతపస్వి కె.విశ్వనాథ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం విశ్వనాథ్ చిత్రాలు, సాహిత్యం, సమాజం అనే అంశంపై ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో గ్రంథాలయ సొసైటీ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వనాథ్ క్రమశిక్షణ కలిగిన దర్శకుడని, విలువల కోసం కట్టుబడిన మహోన్నత వ్యక్తని కొనియాడారు. డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సినీ చరిత్రలో విశ్వనాథ్ ఒక యుగకర్తగా అభివర్ణించారు. నవ సాహితి ఇంటర్నేషనల్ నిర్వాహకుడు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విశ్వనాథ్‌తో తన అనుభవాలను వివరించారు. రాంభట్ల నృశింహశర్మ మాట్లాడుతూ విశ్వనాథ్ చిత్రాల్లోని సాహిత్యం, సాంస్కృతిక విలువలను వివరించారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, చిట్టెళ్ల నిర్మల, బి.వెంకటరావు, యడవల్లి సుధాకర్ పాల్గొన్నారు.



కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళులర్పిస్తున్న అతిథులు

సీతమ్మధార అర్బన్ తహసీల్దార్‌గా శ్రీరామమూర్తి



సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ మండల తహసీల్దార్‌గా జి.శ్రీరామమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించా రు. గతంలో విజయనగరం జిల్లా జియ్యం వలసలో ఆయన తహసీల్దార్‌గా పనిచేశారు. మన్యం(పార్వతీపురం) జిల్లా కలెక్టరేట్‌లోని జి.సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసి బదిలీపై సీతమ్మధార తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తిని డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

టూరిజం ఫెయిర్ ప్రారంభం

బీచ్ రోడ్డు: దేశ వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రదేశాలను అనుసంధానం చేసేందుకు టూరిజం ఫెయిర్‌ను దేశంలోని అనేక నగరాల్లో నిర్వహిస్తున్నట్టు టీటీఏ ప్రెసిడెంట్ కె.విజయ్‌మోహన్ తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న టూరిజం ఫెయిర్‌ను శుక్రవారం హోటల్ గేట్ వేలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫెయిర్ ప్రయాణ, వాణిజ్య కార్యకలాపాలను మరింత మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందన్నారు.

100 మందికి ఇళ్ల పట్టాలు



పట్టాలు పంపిణీ చేస్తున్న మొల్లి అప్పారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 16వ వార్డులో వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొని సుమారు 100 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బొల్లంగి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి కృష్ణా కాలేజీ విద్యార్థి



దిలీప్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

బీచ్ రోడ్డు: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థి వై.దిలీప్ జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో దిలీప్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు పంజాబ్‌లోని రాజ్‌పురాలో ఉన్న చిత్కారా విశ్వవిద్యాలయంలో జరగనున్న శిబిరంలో దిలీప్ పాల్గొంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారులు పోల ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రిషిక ప్రతిభ



రిషిక, త్యాగరాజ్‌లను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్

తాటిచెట్లపాలెం: కేంద్రీయ విద్యాలయం(వాల్తేర్) విద్యార్థిని జి.రిషిక జాతీయ స్థాయిలో విశేషంగా ప్రతిభ చూపుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో రిషికను కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి కళా ఉత్సవ్‌లో రిషిక తన ప్రతిభను చాటి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ప్రతినిధిగా ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. ఇటీవలే జరిగిన రిపబ్లిక్ డే వేడుకలు, పరీక్షా పే చర్చ కార్యక్రమాల్లో కూడా ప్రత్యేక ఆహ్వానితురాలిగా రిషిక పాల్గొని నగరానికి చేరుకుందని చెప్పారు. ఈ సందర్భంగా రిషికకు సంగీతంలో మెళకువలు నేర్పించిన కేవీ వాల్తేర్ సంగీతం అధ్యాపకుడు డాక్టర్ డి.వి.కె.జి.త్యాగరాజ్‌ను అభినందించారు.

రైతుబజార్లలో రైతులకు కార్డులు తప్పనిసరి

ఆరిలోవ: రైతుబజార్లలో స్టాళ్లు నిర్వహిస్తున్న రైతులు, వ్యాపారులు తమ వద్ద స్టాల్ కార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ షేక్ యాసిన్ సూచించారు. ఎంవీపీ రైతుబజార్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల రెన్యువల్ చేసుకున్న 288 మంది రైతులు, వ్యాపారులకు రైతుబజార్ ఈవో జి.ప్రసాద్‌తో కలిసి కొత్త కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన స్టాల్‌ను వారే నిర్వహించాలన్నారు. స్టాల్‌లో కార్డు ఉన్న వ్యక్తి మాత్రమే విక్రయాలు జరపాలని సూచించారు. వినియోగదారులతో దురుసుగా ప్రవర్తించకుండా మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. స్టాల్ వద్ద ఎలాంటి చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. అపరిశుభ్రంగా ఉన్న స్టాళ్ల రైతులు, వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు రెన్యువల్ చేసిన కొత్త కార్డులు అందిస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్

ఇగ్నో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఎంవీపీ కాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే గతంలో ప్రకటించిన గడువు జనవరి 31తో ముగిసింది. విద్యార్థుల సౌకర్యార్థం ఇగ్నో దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు పొడిగించింది. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

డ్వాక్రా బజార్‌కు విశేష స్పందన



సందర్శకులతో కిటకిటలాడుతున్న డ్వాక్రా బజార్

బీచ్ రోడ్డు: డ్వాక్రా మహిళలు, చేనేత కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించాలనే ఆలోచనతో బీచ్ రోడ్డులోని విశ్వప్రియా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌కు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దేశ వ్యాప్తంగా మహిళలు తయారు చేసిన వస్తువులను ఒక వేదికపైకి తీసుకురావడానికి ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని నిర్వాహకులు మహేష్ తెలిపారు.

బెంగాల్, పోచంపల్లి, గద్వాల్, కశ్మీర్, జైపూర్, తదితర నగరాల నుంచి తీసుకొచ్చిన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 11వ తేదీ వరకు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.

18 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన

సీతంపేట: సాయిదుర్గ హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో రామటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఇటీవల ప్రారంభమైన చేనేత వస్త్రాల ప్రదర్శన ఈ నెల 18 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు కె.హరీష్, సలోమి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చేనేత, హస్త కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్నాటక, జైపూర్, న్యూఢిల్లీ రాష్ట్రాల కళాకారులు రూపొందించిన వివిధ కళాత్మక వస్తువులు, వస్త్రాలను ప్రదర్శించడంతోపాటు విక్రయిస్తామన్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల వారికి అవసరమైన వస్త్రాలు అందుబాటులో ఉంచామన్నారు. 50కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేశామని, ప్రవేశం ఉచితమని, నగర ప్రజలు చేనేత, హస్తకళాకారులను ఆదరించాలని నిర్వాహకులు కోరారు.



చేనేత వస్త్రాలను ప్రదర్శిస్తున్న కళాకారుడు